


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**వర్ష వర్షానికి** విభిన్న ప్రేమవల్లరిని చూస్తూ– ఆశ్చర్య రసావిష్టుడై– ప్రతి కదలికా తనపై ముద్రించే ప్రతి అనుభూతినీ తనే ఒక ప్రేక్షకుడిగా, ఆనందంగా చూసుకునే ఒకప్పటి స్థితి నుంచి– ఈ నిర్లిప్త సమాధిలోకి తనెందుకు వచ్చి పడ్డాడో అతడికి అర్థం కావటంలేదు. అతడికేం కావాలో అతడికే తెలియటంలేదు. అతడెందుకు గీయలేకపోతున్నాడో ఈ అసంతృప్తి ఎందుకో అతడికే అస్పష్టంగా ఉంది.

అలా తిరిగి తిరిగి ఏ అర్ధరాత్రో భవంతికి వచ్చాడు. ఆశ్చర్యం అనిపించింది. నిద్రమత్తుతో జోగే వంటవాడూ, చీకటిని పారద్రోలే మసక వెలుతురూ అన్నీ మాయమై, ఒక కొత్తకాంతిని నింపుకున్నట్టు, ''అమ్మా ఆయే సాబ్'' అన్నాడు గూర్ఖా

❦❦❦

''ఏమిటిది? ఇలా అయిపోయారేమిటి?''

అతడు నవ్వటానికి ప్రయత్నం చేస్తూ ''బాగానే ఉన్నానుగా అనూజ్ఞా'' అన్నాడు.

''లేదు. మీలో మార్పు స్పష్టంగా తెలుస్తోంది. అంతకుముందు వేసిన బొమ్మ కూడా చింపేశారటగా.''

''అవును. చాలా అసహ్యంగా తయారైంది. నాకే విసుగొచ్చి పారేశాను. దానికేం గానీ నువ్వు ఇలా చెప్పా పెట్టకుండా వచ్చేశావేమిటి?'' మాట మార్చేడు.

ఆమె నవ్వింది. ''నాన్నగారు విదేశీ యాత్రలకి వెళ్లారు. నాకు ఆటవిడుపు. అంతకు ముందు ఒకటి రెండుసార్లు బయల్దేరదామనుకున్నాను గానీ నాన్నగారు వద్దన్నారు. అద్సరే... మీ సంగతి చెప్పండి ముందు.''

''నా సంగతి నాకే తెలియటం లేదు.''

''ఇక అవన్నీ వదిలిపెట్టండి. ఈ రాత్రి విశిష్టత ఏమిటో తెలుసా? ఈ రోజు కార్తీక పూర్ణిమ. ఎటువంటి పరిస్థితుల్లోనైనా మీరు బొమ్మ గీయబోతున్నారు.''

''ఒక్క రోజులోనా?''

''ఏం? సిమ్లాలో ఒక్క రోజులో గీయలేదూ? ఒక్కరోజు కాకపోతే నెల. ముందు ప్రారంభం అంటూ ఉండాలిగా. అన్నట్టు చెప్పలేదు కదూ. మీ గది మార్చేశాను. ఇంతకాలం మీరు బొమ్మ వేయలేక పోవడానికి కారణం ఆ గదే అనిపించింది. రండి. కొత్త స్థలం చూపిస్తాను'' అంటూ పైకి తీసుకెళ్ళింది.

అతడామెను అనుసరించాడు. నిజంగానే ఆ గది ఆహ్లాదకరంగా ఉంది. కిటికీ తెరిస్తే దూరంగా సముద్రం కనబడుతోంది. కిటికీ కర్టెన్లతో సహా ఆ గదిలో వాడిన అన్ని వస్తువుల రంగులూ ఒక కళాకారుడికి స్ఫూర్తినిచ్చేవిగా ఉన్నాయి.

చిన్నపిల్లాడిని బెదిరిస్తున్నట్టు ''మీరు బొమ్మ ప్రారంభించేవరకూ ఆ గదిలోంచి బయటికి రావడానికి వీల్లేదు.'' అంది. ''అన్నీ ఇక్కడికే పంపమని నౌఖర్లకి చెప్పాను...'' బయటికి వెళ్ళబోతూ ఆగి, ''అంతేకాదు. మీరు బొమ్మ పూర్తి చేసేవరకూ నేను మీతో మాట్లాడను'' అన్నది.

''అనూజ్ఞా.. ఇదంతా...'' అంటూ అతడు కంగారుగా ఏదో చెప్పబోతోంటే 'ఇక మాట్లాడను' అన్నట్టు ఆమె నోటి మీద చూపుడు వేలు ఆన్చి నాలుక బయట పెట్టి వెక్కిరించి వెళ్ళిపోయింది.

కిటికీలోంచి వచ్చే గాలితోపాటు సముద్రపు హోరు కూడా వినిపిస్తోంది. కిటికీ తెరలు అతడి మనసులోని వాసిలేటింగ్ భావానికి ప్రతీకగా ఉన్నాయి. అతడు గది మధ్యలో ఉన్న కుర్చీలో కూలబడ్డాడు. స్టాండు, ఖాళీ కాన్వాసు అతడి ఆజ్ఞ కోసం చూస్తున్న నౌఖర్లలా ఉన్నాయి. అతడు కుంచె చేతిలోకి తీసుకున్నాడు. రంగుల్లో ముంచి మిశ్రమం తయారు చేయబోయాడు.

''ఏమిటి నువ్వు వెయ్యబోయే ఆ చిత్రం? అసలు నీకేమైనా ఆలోచన ఉందా? ప్రపంచపు అత్యున్నతమైన చిత్రాన్ని ఏ ధైర్యంతో వేయాలనుకున్నావు?'' లీనార్డో–డా–విన్సీ ప్రశ్నిస్తున్నాడు.

''నేనిది నెంబర్ వన్ చేస్తానంటూ ఈ ప్రపంచంలో ఏ చిత్రకారుడూ పెయింటింగ్ ప్రారంభించలేదు. గీసాకే అవి ప్రఖ్యాతి పొందాయి'' అంటున్నాడు మైకెలాంగిలో.

''డబ్బుకోసం బొమ్మ గీయటంలో తప్పు లేదు కానీ వాటిలో ఆర్ధ్రత ఉండదు. నాలాగా 'క్లిష్టత' ప్రయత్నించు. నీ మనసు ఇప్పుడు అలాగే ఉందిగా'' పికాసో సలహా ఇస్తున్నాడు.

విసుగ్గా కార్తికేయ కుంచె విసిరేసి వచ్చి కూర్చున్నాడు. జుట్టులోకి చేతులు జొనిపి నిరాశగా నిస్పృహగా కళ్ళు మూసుకున్నాడు. అతడి అవిశ్రాంత కదలికని ఆమె గమనిస్తోందని అతడికి తెలీదు. సముద్రం లాగే ఆమె కూడా అతడిని సానుభూతితో చూస్తోంది. బిడ్డ ఏడుపు వింటూ ఏమి చెయ్యాలో తోచని తల్లిలా ఆమె తల్లడిల్లిపోతోంది.

సహేతుక, నిర్హేతుక నియంత్రణల మధ్య నిర్లిప్తతతో... సంధ్యా, ఉషస్సుల మధ్య చీకట్లలో అతడలా ఎన్ని రోజులున్నాడు? క్షణాలా? గంటలా? దినాలా? యుగాలా..? మనసు లాగే కుంచె ఎండిపోయింది. మమత లేక మనసూ శూన్యమైంది. చీకటి వెళ్ళి వెలుగొచ్చింది. గదిలోకి మాత్రమే! వెలుగు వెళ్ళి మళ్ళీ చీకటి వచ్చింది. అది మనసులోనే ఉంది.

అతడా నిర్వికల్ప సమాధిలో ఉండగా ఆ సమయంలో సముద్రం మీద ఒక మెరుపు మెరిసింది. తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. చంద్రుడు పైకి రాగానే వెన్నెల కిరణం కిటికీలోంచి లోపలికి ప్రవహించినట్టుగా ఆ గదిలోకి వెలుతురు పయనించింది. అప్పటి వరకూ గదిలో బంధింప బడి ఉన్న గాలి స్థాన భ్రంశం చెందటంతో సముద్రపు గాలి కిటికీలోంచి లోపలికి ప్రవేశించింది. పురోహితుడు మంత్రం చదువుతున్నట్టు కిటికీ తెరలు లయబద్దంగా కదిలాయి. కెరటాలు వేదాలై ఘోషిస్తూ  నిశ్శబ్దాన్ని కూడా స్వరబద్ధం చేశాయి.

అతడు తలెత్తి చూశాడు. కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. ఏమి గీయాలో అతడి కుంచెకు చెపుతున్నట్లు, ఎలా సృష్టించాలో సరస్వతి బ్రహ్మకి చెపుతున్నట్టు, ఎటు తిరగాలో నదికి కొండ సలహా ఇస్తున్నట్టు వెన్నెల కిరణం మధ్యలో ఆమె నిల్చుని ఉంది. ఆమె వంటి మీద ఒక పలుచటి పారిజాత పువ్వులాటి ధవళాంబరం మాత్రమే ఉంది. అంబరం మీద సంజె రంగుల్ని వెదజల్లే సూరీడి సంబరాన్ని ఏ మేఘమాపగలదు? ఆ వస్త్రంలోంచే ఆమె బంగారు మేనిఛాయ తన కాంతుల్ని వెదజల్లుతోంది.

అనంతానంత సంతత గానాంతర ప్రశాంతత ఆమె చుట్టూ పరివేష్టించింది. తలల నూపు లతల నూపురపు గాలి ఆమె శిరోజాల నూపుతోంది.

ఆమె అనాచ్ఛాదిత నగ్న శరీరం మీద నుంచి దీపపు కాంతి శిశిర శిశిర మందర తరళ తరళ మంద మందాకినిలా జారిపోతోంది. ఆమె చేతిమీద నుంచి కటి మీదుగా జారిన పారదర్శక వస్త్రం– మన్మథుడి అస్త్రంలా – సరిగంచు మరకతపు చలి మంచులో– నగ్నానికి, అర్ధనగ్నానికి మధ్య చిగురాకు అరవిచ్చుకున్న సరిహద్దులో – నులివెచ్చ అందపు అరతొడిమ తన వెండంచు పయ్యెద అర జార్చినట్టుంది.

మోనలిసాకి మోడల్ ఎవరో తెలీదుగానీ ప్రకృతికే ప్రతినిధిలా ఉన్నదామె.

అతడు కుంచెని చేతుల్లోకి తీసుకున్నాడు. క్రిందనుంచి పైవరకు ఆమెని అలవోకగా పరికించాడు. అతని చూపు... కేన్వాస్ మీద బ్రష్‌ని క్రింద నుంచి పైకి సుతారంగా కదిలించినట్టయి ఆమె సన్నగా వణికింది. అతడు ఆమె అందాన్ని సరి అయిన కోణంలో పట్టుకోవడం కోసం తలవంచి అటు ఇటు తిప్పి ఆమెని చూశాడు.

**'ఈ హృదయాంతరము సోకి,  ఆ దిశాంతము తాకి' అన్నట్టు**

**చల్లటి సముద్రపు అడుగు నెక్కడో అగ్నిపర్వతం బద్దలైనట్టుగా...**

**మానస రసదునీ మాధురులపైన మాట్లాడే చూపు కొసలు.**

**తనువు కిన్నెర వీణ మీట, జారవా వళ్ళంతా వేయి నీహారికలు.**

అందమైన ఇబ్బంది. అవును మరి. ఎంతైనా స్త్రీ కదా. అతడు కుంచె అంచుని రంగులో ముంచాడు. ఆమె వెనుక కిటికీ తప్ప మరే వెలుగూ లేదు. వెలుగు నీడల మిశ్రమం గురించి ఆమెక్కూడా తెలుసు కాబట్టి ముందుకు వచ్చింది. వెనుక వెన్నెల మడుగు, ముందు లైటు వెలుగు, సరిహద్దులో నిల్చుని ఉంది ఆమె. ఎరుపు తెలుపుల మబ్బుటెండలో ఆమె చెవికమ్మ ఏరువాకమ్మలా మెరుస్తోంది.

అతడు కొలతలు చూసుకోలేదు. దేవుడే ఆ అమ్మాయి జఘనాన్ని గగనానికీ, పొత్తికడుపుని పత్తిపూలకీ అప్పచెప్పినట్టున్నాడు. స్థనములు మరీ ఎత్తయిపోతున్నాయని చూచుకములతో సీల్ చేసాడు. కళ్ళు విశాలమైపోతున్నాయని సరిహద్దు రేఖలుగా ఆ కనుబొమ్మల్ని గీసినట్టున్నాడు. ఇక కొలతలెందుకు? పై పై గీతలు గీసి ఏకంగా రంగుతో కనుబొమ్మతో ప్రారంభించాడు.

వేగంగా కదులుతున్న అతడి చేతిలోని కుంచె ఆమెకి కనపడటం లేదు. కానీ వేగం తెలుస్తోంది. అతడీ ప్రపంచంలో లేడు. ఆ కనుబొమ్మలు దిద్దటానికి అతడికి రెండు గంటలు పట్టింది. ఆమె అలాగే నిలబడి ఉంది. గంటలు రోజులవుతాయని ఆమెకు తెలుసు.

ఆపై అతడామె కన్నులవైపు చూశాడు. స్వచ్ఛంగా ఉన్నాయా కళ్ళు.

తమకన్నా అందంగా ఉన్న ఆ కళ్ళని చూసి కలువ రేకులు ఈర్ష్యతో చంద్రుడితో మొర పెట్టుకుని ఉంటాయి. ప్రియురాళ్ళ తరఫున చంద్రుడు బ్రహ్మ మీద యుద్ధం ప్రకటించి, ఓడిపోయి వెళ్ళి శివుడి జడలో దాక్కుని ఉంటాడు. అది చూసి గంగ ఫక్కున నవ్వితే, ఆ మందాకినీ మంచు తెల్లదనం వచ్చి ఆ కన్నులలో చేరటంవల్ల వచ్చిన స్వచ్ఛదనం అది.

వాటిని అంతే అందంగా చిత్రీకరించటానికి అతడు ఎన్ని గంటల్ని క్షణాలుగా గడిపాడో అతడికే తెలీదు. ఆమె శిలా ప్రతిమలా అలాగే ఉంది. అతడు ఘర్షణ. ఆమె స్పందన. కళామతల్లి కాళ్ళకి ఇద్దరూ పారాణి పూస్తున్నారు.

వదనాన్ని చిత్రీకరించటం పూర్తయ్యాక అతడు శరీరం వైపు చూశాడు.

యవ్వనంలో ఏ స్త్రీ అయినా అందంగా ఉంటుందంటారు. కానీ ఆమె బాల్యం నుంచీ అందమైనదే. వస్తూనే బాల్యాన్ని పారద్రోలటానికి యవ్వనం ప్రయత్నించింది. కానీ, స్త్రీకి అన్ని అంగాలూ యవ్వనంతో పొంగారుతే బావోదు. కొన్నిటిలో బాల్యపు ఛాయలుంటేనే బావుంటుంది. అందువల్ల మన్మథుడు కల్పించుకుని బాల్యమూ, యవ్వనమూ ఏయే స్థానాన్ని ఏవేవి ఆక్రమించుకుని ఉండాలో, సన్నటి నూగూరు రోమాలతో సరిహద్దు రేకల్ని గీసినట్టుంది.

మనిషి సృష్టికి కావలసిన మట్టిని ఇచ్చే భూదేవి, ఆమె స్థనాల విషయంలో 'అంత' ఇవ్వలేక ఓటమిని ఒప్పుకుని యుద్ధానికి అధిపతి అయిన అంగారకుడి నుంచో, శృంగారానికి అధిపతి అయిన శుక్రుడి నుంచో తీసుకొమ్మని సృష్టికర్తని

ప్రాధేయపడి ఉంటుంది. విభక్తులు వ్రాసిన పండితుడు ఎవరో ఆమె చూసే వ్రాసి ఉంటాడు. ప్రధమంగా కుచములు దుమువులు. నిన్ ద్వితీయ. చేతన్ తృతీయ. కొరకును చతుర్థి, పట్టి పంచమి, లోపలన్ షష్టి, అందునన్ సప్తమి.

మెడ క్రిందవి వింద్యాధర అచలాలు. జడ చివర్లు విహారాచలాలు. నడుము నాగార్జున కొండ దగ్గర అలిగిన కృష్ణవేణి. స్థనమధ్యం హిమాలయాల నడుమ నలిగిన అలకనంద. నాభి నతనాభి బిరుదు ప్రదాత. ఉదరం శబరీ గోదారీ సంగమించే కూనవరం కోన ఇసుకతిన్నె.

యవ్వనంలో ఉన్న గుర్రం, రౌతు అధిరోహించగానే ముందుకు దూకటానికి ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది. ఆ ఉధృతాన్ని ఆపటానికి దాన్ని బలమైన కళ్ళెంతో బంధించి ఉంచుతారు. రతి వయసు వచ్చే వరకూ జఘున, నితంబాల లయబద్ధ ఉధృతాన్ని ఆపటం కోసం విరులనే కళ్ళేలుగా బిగించి ఉంటాడు బ్రహ్మ. అందుకే ఆమె కురులు మోకాళ్ళ వరకూ ఉన్నాయి.

పాపి కొండల మదమణచ పాలిండ్లు, గగనపు మదమణచ జఘనమూ సృష్టించి, 'మరీ ఇంత సన్నగా ఉన్నదేమిట'ని నడుము పిడికిలితో పట్టి చూసినప్పుడు బ్రహ్మ బొటనవేలు వెనక్కీ, మరో మూడు వేళ్ళు ముందుకీ రావటంతో ఆ ఒత్తిడికి పొత్తికడుపు మీద మూడు అందమైన సన్నటి రేఖలు ఏర్పడ్డాయి. కేవలం పద్మినీ జాతి అమ్మాయిల కుండే గీతలవి.

అరటి బోదెలు తమ కాండాల నునుపుదనాన్ని ఆమె ఉరువులకిచ్చి తమ పేరు పెట్టుకుని విర్ర వీగుతున్న 'రంభ' గర్వమణిచాయి. పాములు తమ హొయలు ఆమెకిచ్చి తమ శత్రువైన నెమలిని పరిహసించాయి. ఆమె పొందు పొందిన వాడికి నిరంతరం నోరు ఎర్రగానే ఉంటుంది. తమలపాకుల కన్నా పలుచనైన పెదవుల్నీ, ఎర్ర పోక వక్కల్లాటి స్థనాగ్రాల్నీ రోజూ స్పృశిస్తూనే ఉంటాడు కదా!

ఎటూ చూడకుండా అతడు ఆమె అందాలు మరింతగా చెక్కుతూన్నాడు. కెరటం కదుల్తూనే ఉంది. సూర్యుడు రోజూ వస్తూనే ఉన్నాడు. అతడి కుంచె ఆమె అందాల్ని పట్టుకుంటోందా? అందాలు అతడి కుంచెని పట్టుకుంటున్నాయా? ఆమె అందెల చప్పుడుని కూడా తన బొమ్మలో చిత్రీకరిస్తున్నాడు. అతడా క్షణం ఒక ఋషిలా కనపడ్డాడామెకు. గెడ్డం పెరిగింది. కళ్ళు లోతుకు పోయాయి. ఆమె అతడి ఏకాగ్రతకు భంగం కలిగించలేదు. దూరంనుంచే నిశ్శబ్దంగా అతడిని గమనించేది. కావలసినవి సమకూర్చేది. మాటలు లేవు. అసలతను తలెత్తేవాడు కాదు.

కనురెప్ప వెంట్రుక చివర్ల నుండి, నఖాంతాలవరకూ యథాతథంగా తన రూపు అతడి మనసులో ముద్రించుకుపోయిందని ఆమె గ్రహించింది. ఇక తను నిలబడవలసిన అవసరం లేదని తెలుసుకుంది.

బొమ్మ గీస్తూ అనుకున్నాడు. **నేను శాశ్వతం కాదు. అనూజ్ఞ మీద నాకున్న అభిమానం శాశ్వతం కాదు. చివరికి ప్రేమకూడా శాశ్వతం కాదు. ఈ బొమ్మ శాశ్వతం.** అతడికి అంతులేని సంతృప్తి కలిగింది. అనంతమైన విషాదం కలిగింది. సంతృప్తిలోంచి కలిగే విషాదం అంటే ఏమిటో వేదాంతులకే తెలుస్తుంది. ఆ బొమ్మ గీయటం ద్వారా అతడు

వేదాంతి అయ్యాడు. అది తాత్కాలికమయితే అవొచ్చుగాక. అది వేరే సంగతి. ప్రసవం పూర్తయిన మరుక్షణం బిడ్డని కన్నానన్న సంతోషంతో పాటు తననుంచి బిడ్డ వేరయిందన్న భావం విషాదం. అందమైన విషయాలే విషాదాన్ని కలుగజేస్తాయి. ఎక్కడైతే అందం ఉందో అక్కడ ఆనందం ఉంది. ఎక్కడైతే ఆనందం ఉందో, అది అశాశ్వతం కాబట్టి అక్కడ విషాదం ఉంది.

ఆ బొమ్మ పూర్తికాగానే అతడికి భరించలేని ఆనందంతో కలిసిన దుఃఖం కలిగింది. ఆనందపు గర్భగుడిలో, సంతృప్తి అనే విగ్రహం వెనుక చీకట్లో విషాదం దాగి ఉండటం అంటే అదే.

అందుకే... ఈ ప్రపంచ సాహితీ చరిత్రలో అత్యద్భుతంగా నిలిచిపోయిన గేయాల్లోఒకటైన ODE ON MELANCHOLY చివర్లో 'విషాదాన్ని ఆనందించగలవాడే జీవితాన్ని ఆనందించగలడ'ని అంటాడు కీట్స్. విషాదం అంటే దిగులు. అందమైన ఉషస్సును చూస్తూ సూర్యుడు పైకి వచ్చేస్తున్నాడనే దిగులు. తాజ్‌మహల్‌ని చూస్తూంటే తిరిగి వెళ్ళాలనే దిగులు. ప్రేయసి కళ్ళల్లో ప్రపంచాన్ని మర్చిపోతూ విడిపోవాలనే దిగులు. అందమైన జలపాతాలూ, అప్పుడే విచ్చిన గులాబి పూవు... అందమంతా దిగులే. ఏ రసానుభూతి ఎక్కువైనా కన్నీళ్ళే. విజయం తరువాత కూడా కన్నీళ్ళే.

ఈ కొండ మీద నుంచి ఆ కొండమీదకు తాడు కట్టి వెళ్ళి ప్రపంచ రికార్డు స్థాపించినవాడు, ప్రాణాలని పణంగా పెట్టి అవతలి గమ్యం చేరగానే ఆనందంతో ఏడ్చేస్తాడు.ప్రస్తుతం అతను ఆ స్థితిలోనే ఉన్నాడు.'శాశ్వతం'లో తనని తాను గుర్తించుకున్నాడు.

అతని భార్య 'డిటాచ్‌మెంట్' గురించి ప్రస్తావించేది. ఆ డిటాచ్‌మెంట్‌లోనే తనని కూడా పోగొట్టుకుని ఈ విజయం సాధించాడు. ఒక రసానుభూతిలో తనని తాను పోగొట్టుకోవటం అంటే ఏమిటో తాన్‌సేన్‌కి తెలుసు. త్యాగరాజుకి తెలుసు. అరిస్టాటిల్‌కి తెలుసు.

ఈ చిత్రపు పాదాల చెంత అతడా విధమైన అలౌకిక స్థితిలో ఉండగా ఆమె ఆ గదిలోకి ప్రవేశించింది. ఆ చిత్రాన్ని చూసి ఆమె కనులు సంభ్రమాతీత విభ్రమంతో పెద్దవయ్యాయి. 'ఒహ్' అన్న రెండక్షరాలు అప్రయత్నంగా నోటి వెంట వచ్చాయి.

తనే ఒక చిత్తరువై తన చిత్తరువుని చూస్తుండిపోయింది. అత్తరి ఆనందపు జల్లులతో ఆమె మనసు చిత్తడి అయింది. ఆ చిత్తరువుని తను కూడా చూడటానికా అన్నట్టు ఒక సముద్ర కెరటం పైకి లేచింది. ఒక ఏటవాలు వెన్నెల కిరణం చంద్రుడి రాయబారిగా కిటికీలోంచి లోపలికి వచ్చి ఆ చిత్రాన్ని పరామర్శించింది. దూరం నుంచి వినిపించే కొబ్బరిచెట్ల ఆకుల చప్పుడు ఆ అపురూపమైన కళాఖండానికి ప్రకృతి కొడుతూన్న జేజేల ధ్వానంలా ఉంది.

అతడు లేచి నిలబడ్డాడు. ఒక చిన్న పోటీలో తమ దేశాన్ని గెలిపిస్తేనే అందరూ హర్షాతిరేకంతో అభినందనలు తెలుపుతారు. ఇక ఓడిపోయే స్థితిలో ఉన్న జట్టుని గెలిపిస్తే ఆ 'ఎకస్టసీ' కి అంతే ఉండదు. అటువంటిది ఆ అద్భుతాన్ని సృష్టించిన అతడి పట్ల ఆమె ఉద్వేగం సంరంభాన్వితమైతే అందులో వింతేమున్నది?

ఆ విన్యాసానికి ఆమె నిలువునా కరిగిపోయింది. గోవులా... గోదావరిలో కదిలే నావలా... కదిలే మేఘపు నీడలా... వసంత మామిడి పూతలా... జారే బంగారు పోతలా... ఆమె అడుగు ముందుకు వేసింది.

అతడి కన్నీటి మసకల్లో ఆమె అస్పష్టంగా కనబడుతోంది. అష్టకష్టాల కోర్చి, ప్రాణాలకు తెగించి ఎన్నో రోజుల పాటు ఎత్తయిన హిమశిఖరం అధిరోహించిన జంట, శిఖరపు అంచు మీద ఒకర్నొకరు ఏ విధంగా అభినందించుకుంటారో ఆ ఉద్వేగం ఇద్దరిలో కనపడింది. ఆమె మరో అడుగు ముందుకు వేసింది. కోర్కెకి స్త్రీ సహజమైన 'బిడియం' అనే ఆనకట్టని వేసి, ప్రేమకు కట్టుబాట్ల బంధం కట్టి, ఇంతకాలం తన ప్రేమను కేవలం మాటల్లోనే వ్యక్తీకరించింది. ఇప్పుడామె ఒక్కొక్క అడుగూ వేస్తుంటే ఒక్కొక్క ఆనకట్ట తెగింది. ఒక నిర్ఘరఝరిలా ప్రవహించి అతన్ని చుట్టు ముట్టింది. అతడామె అభినందనని స్వీకరిస్తున్నట్టు కృతజ్ఞతతో, అలసటతో, ఆర్తితో ఆమె మెడ వంపు లోయలో తల దాచుకుని కళ్లు మూసుకున్నాడు. ఇంతకాలం తన వేదనకి అర్థం తెలిసింది. కొండ వంపు లోయలో అతడికి గుహల్లో ఋషులకి లభించే ప్రశాంతత దొరికింది.

ఆచ్ఛాదనలేని తన భుజానికి అతడి పెదవులు తగలగా ఆమె వణికింది. అప్పటి వరకూ తన నగ్న శరీరం మీద కదలాడిన అతడి చూపుల కొసవేళ్ళు, ఇప్పుడు యవ్వన పత్రంమీద మన్మథుడి చేవ్రాళ్ళుగా మారుతోంటే, తొలి లేత నును సిగ్గుతో ఆమె కంపించింది.

అతడు తల పైకెత్తాడు. అతడి ఊపిరి ఆమె చెంపలకు వెచ్చగా తగిలింది. ఊపిరి ఉత్పల మాల. చూపు చంపకమాల..! కౌగిలి కైవారగీతి పాడగా, గుండె మంగళ హారతి ఇవ్వగా, అడుగులు తడబడ, చూపులు కలబడ... 'అప్పుడు మూసిన కనుల మీద నిద్దుర లేమి. ఇప్పుడు తీసిన కనురెప్పల్లోకి నువ్వు రావేమి?' అన్నట్టుగా ఆమె మరింత దగ్గరయింది. అతడు వెనక్కి జరగ బోయాడు. చూపులు బంధించాయి. అధరములు అధూతములై ఆహ్వానం పలికాయి. చేతులు అజగవములై హారతి నిచ్చాయి.

సమయం వృథా చేయటం ఇష్టంలేకే ఆదిమానవుడు బట్టలు కనుక్కోలేదు. భావం భాగేశ్వరి, సామీప్యం ఆనందభైరవి, మాట మాయామాళవ గౌళ, కౌగిలి యమన్ కళ్యాణి, శృంగారం కదనకుతూహలం. అతడిలోనూ ఒక విస్ఫోటనం... సిమ్లాలో ఆమె వేసిన బొమ్మ గుర్తొచ్చింది. ఆ కళ్లు... కోర్కెకి కొసవేళ్ళు... నిద్రించే వాంఛని వేడి చేసే చలి నెగళ్ళు. తరతరాల, యుగయుగాల అతడి కోరిక నిద్ర లేచింది. వెన్నుమీద చేయి వేసి విల్లులా ఆమెని తనలోకి వంచుకున్నాడు. ఆమె తనువు అతడి వైపు మరింత దగ్గరగా రావటంవల్ల జఘనం గగనమైంది. కోరికతో బరువెక్కిన

పాలిండ్లు ఇద్దరి మధ్యా నలగటంతో,... చోటులేక తిరిగి వెనక్కి హృదయంలోకి తన్నుకెళ్లి... కోరికని మరింత ఎగజిమ్ముతున్నాయి.

ఆమె శరీరం మొత్తం అతడి కౌగిలిలో ఇమిడిపోయింది. అతనికి ఆమె మోహం మాత్రమే కనిపిస్తోంది. ఆమె శరీరంలోని ప్రతి రక్తపు బొట్టూ అతని పట్ల తమకున్న కోరికనీ, ఇన్నాళ్ళూ అతని కోసం తాము దాచుకున్న తపననీ అతడికి చూపించటంకోసం అన్ని అంగాల్నుంచీ అతని చూపు సోకే చోటికి పయనించి రావటంతో, ఆమె మొహం అరుణవర్ణ జ్వలిత జ్వాలా శిఖరమైంది. ఆమె ఆవేశంగా అతని పెదవుల్ని తన పెదవుల్తో వత్తింది.

**ఎక్కాలు తప్పి... పెదవులు రెండు రెళ్లు ఒకటై,**

**వాస్తు తప్పి... పాలిండ్లు మురిపాల ఇండ్లై**

**ఒక పవనపుటల తనువంతా తుఫాను చందాన.**

**ఒక మదనుని వల నాభి చెంత నందన వనాన...**

అన్నట్టుగా ఆమె చెలరేగిపోయింది. అవధులు దాటిన ఆవేశపు పారవశ్యంతో వళ్ళు పరవళ్ళు తొక్కింది. తొలి సంగమంలో స్త్రీకి కలిగే సహజమైన మైకం ఆమెని చుట్టుముట్టగా అలాగే నేలమీదకు జారిపోయింది. విశ్వం సర్వస్వం నిస్వనాన్ని ఆస్వాదిస్తూ వారిని చూస్తోంది. అనుభవం అస్థిత్వం పొందటానికి ఆయత్తమవుతోంది. అతడిని తన హృదయంలోకి ఆహ్వానిస్తున్నట్టు ఆమె చేతులు సాచింది.

ఆ సమయంలో...

ప్రకృతిలో లీనమవటానికి పురుషుడు కదిలినప్పుడు...

ఆమె మెడలో గొలుసు చూసి... ఒక మంగళసూత్రం గుర్తొచ్చి.

ఒక నైతిక సూత్రం వెన్ను చరిచి...

మేఘాలగుండా ఒక విద్యుద్ఘాతం మెరుపై, వెరుపై, ఎదపై ఒక ఛెళుపై అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు.

రాబోయే తుఫాను కోసం కనులు మూసుకుని అది ఆగిపోతే, ఆ ప్రశాంతత కూడా ఇబ్బందికరమైనదన్నట్టు ఆమె కళ్ళు తెరిచే సరికి, అతడు దూరంగా... తనలోకి తనే ప్రవేశించి తనని చంపేసినట్టు జీవం లేకుండా ఉన్నాడు.

అతడు నిశ్శబ్దాన్ని సాయమడిగాడు. ఆమె కాలాన్ని సాయమడిగింది. విషయం అర్థమై, వాస్తవం ఆర్ద్రమై, వెళ్ళి నెమ్మదిగా అతడి కాళ్ళ దగ్గర కూర్చుని, కాళ్ళమీద తల వాల్చింది. అతడు ఆమె తలమీద చెయ్యివేసి ''నన్ను క్షమించు'' అన్నాడు.

''ఎందుకు?'' ఆమె తలెత్తకుండా అభావంగా అంది.

''నేను నీకెలా చెప్పాలో... అసలిది ఇంతకాలం నీకు తెలియనివ్వకుండా ఉండటం... నాకే సిగ్గుగా ఉంది.''

‘‘ఏమిటది?’’

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments